# వియోగంలో వినోదం

కుర్చీలో కూర్చొని తాపీగా చుట్ట కాలుస్తున్న ముసలాయన ముఖంలో ఒక్కసారిగా నవ్వు వెల్లివిరిసింది. ముడతలుపడ్డ ముసలి ముఖంలో అరవైయేళ్ళ అనుభవాలు దోబూచులాడాయి.

"ఇలా రావే తల్లీ" గుమ్మంలో ఆడుకుంటున్న మనుమరాలిని పిలిచాడు ముసలాయన.

"రాను పో తాతయ్యా" వయ్యారంగా కళ్ళు తిప్పింది నాలుగేళ్ళ మనుమరాలు. ఆ పిల్ల కళ్ళలో తళుకు ముసలాయన మనసులో మెఱుపులా మెఱిసింది.

"రావే తల్లీ!" ఈ మాటు గారాబంగా పిలిచాడు ముసలాయన.

ఆ పిల్ల ఒక్క పరుగున తాత వళ్లో వచ్చిపడింది.

"నువ్వు బావుంటావే" పిల్ల ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"పో తాతయ్యా" పెద్దక్కలాగ సిగ్గుపడుతూ నవ్వింది ఆ పిల్ల. ముసలాయనా నవ్వాడు. "నన్ను ముద్దు పెట్టుకో" అన్నాడు.

"ఛీ, మీసాలు గుచ్చుకుంటాయి బాబు" అంది మనుమరాలు ఆ ముసలి మీసాలవంక చూస్తూ.

"నీకు రూపాయి ఇస్తాగా" రూపాయి తీసి చూపాడు తాతగారు.

"రూపాయితో ఎట్లా పరికిణీ వస్తుందా తాతయ్యా?" ఆశగా రూపాయివంక చూసింది మనుమరాలు.

"ఒక్క రూపాయేమిటి, పది రూపాయిలిస్తాను కావాలంటే. జేబులో చేయి పెట్టాడు రూపాయలకోసం. ఆ ముసలి బుగ్గలు ఒక్కసారి ముద్దు పెట్టుకొని రూపాయి లాక్కొని పారిపోయింది రాధమ్మ.

తాతయ్య ఒక్కడూ మిగిలిపోయాడు. ముఖమంతా చేత్తో తడుము కున్నాడు. నిజమే .... మీసాలు పెరిగిపోయాయి. గడ్డం మాసింది. రాధమ్మ చెప్పినట్లు మీసాలు గుచ్చుకుంటున్నాయి .... మళ్ళా ఓ మాటు గడ్డం తడిమి చూసుకున్నాడు. ముసలాయనకి నవ్వు వచ్చింది. ఇప్పు డింత నిర్లక్ష్యం చేస్తున్నాడు గాని రోజు రోజూ గడ్డం చేసిన రోజులు లేకపోలేదు. వయసులో ఉన్నపుడు ఎంత అందంగా వుండేవాడు తను! ఆ రోజుల్లో శరీర పోషణ మహా చూసుకునేవాడు. ఎప్పుడూ బట్ట నలగకుండా, తల చెరగకుండా వుండేవాడు. అందుకే తన భార్యకు తనంటే అంత గర్వంగా వుండేది. ఇప్పుడు తన కొడుకూ వున్నాడు — ఎందుకూ, ఎంత సేపూ ఆఫీసు గొడవేకానీ, అందంగా వుండాలనే సరదా కానీ, హుషారు గానీ లేనేలేవు. ఉన్న మాట ఉన్నట్టు చెప్పుకోవాలి. కోడలు ఎప్పుడూ ముస్తాబయి, పువ్వల్లే ఉంటుంది. ముసలాయన ముచ్చటగా నవ్వుకున్నాడు.

తనలో తనే నవ్వుకుంటున్న తండ్రిని ఎంత సేపట్నుంచో గమనిస్తున్న రామం ఇక ఉండబట్టలేకపోయాడు.

"ఎందుకు నాన్నా అలా నవ్వుతున్నారు?"

కొడుకు తనని పసికట్టాడని తెలిసి ముసలాయన ఎందుకో మహా గర్వపడ్డాడు.

"నిన్ను చూసే" కొడుకు ముఖంలోకి చూస్తూ అన్నాడు.

తండ్రి మాట అర్థం కాలేదు రామానికి.

"అవునురా" ఎప్పుడూ ఆఫీసు కాగితాలేనా .... ఆ గడ్డం చూడు

ఎంత మానిందో! కుర్రాడివి, వయసులో వున్నవాడివి ఎంత అందంగా ఉండాలసలు. అన్నిటికీ బద్ధకమే." ముసలాయన కొడుకు ముఖంలోకి చూదాడు. కొడుకు అచ్చు తన పోలికే. ఆ ముక్కు, బుగ్గలు అన్నీను-ముసలాయనికి కొడుకుమీద కోపంకూడా వచ్చింది. వంటింటి గుమ్మంలో కూర్చొని మనుమరాలికి అన్నం తినిపిస్తున్న కోడలు కనిపించింది. ఆ కోడలంటే ఆయనకి మహా అభిమానం.

"కోడలుపిల్ల బుద్ధిమంతురాలు కనుక...." ముసలాయన కొడుకు ముఖంలోకి నవ్వుతూ చూశాడు.

"నాతో కాపరం చేస్తోందంటారు, అంతేగా?" వంటింట్లోంచి కనిపించే భార్యను చూస్తూ అన్నాడు రామం.

"అంతే మరి" ముసలాయన నెమ్మదిగా కుర్చీలోంచి లేచాడు. సుందరి బుగ్గల్లో సిగ్గు మొగ్గలు తొడిగింది.

"పెరుగు తియ్యగా ఉంది, తిను" రాధమ్మ నోట్లో పెరుగు అన్నం కుక్కి, నవ్వుకుంది సుందరి.

మల్లె పందిరి కింద మంచం వాల్చాడు ముసలాయన. ఒక్క పరుగున వచ్చి తాత పక్కలో పడుకుంది మనుమరాలు. ఆపిల్ల పక్కలో లేకపోతే నిద్ర రాదు ఆయనకి. అసలీ అలవాటు చేసిందే ఆవిడ. "మీ తాతయ్య దగ్గర పోయి పడుకో" అంటూ ఆ పిల్లను అక్కడ పడుకోబెట్టి, ఆవిడ హాయిగా చల్ల గాలిలో అరుగు మీద చాపేసుకుని నిద్రపోయేది. ఎలాగయినా ఆవిడ తరహా, ఆ పద్ధతీ వేరు, ఆవిడగురించి చాలాసేపు ఆలోచించాడు.

నిజం చెప్పాలంటే ఈ మధ్య ఆయనకేమీ తోచటంలేదు. కోడలు శ్రద్ధగానే చూస్తోంది. మనుమరాలు కాలక్షేపంగానే వుంది. ఇంతకీ ఆవిడ వున్నప్పుడు మాత్రం గంటలు గంటలు ఆవిడతో తను కబుర్లు చెప్పిందీ లేదు, తనెప్పుడూ ఆ పేపరు ముందేసుకు కూర్చుంటోంటే అప్పుడప్పుడూ చిరాకుపడి, ఆ పేపరువాణ్ణి రేపటినుంచి గడపలోకి రానిస్తానేమో

చూడండి" అనేది. "గడపలోకి రావడమెందుకూ అసలు వాడు, కిటికీ లోంచి పడేస్తే చాలదూ" అనేవాడు తను. ఆవిడ బుగ్గలు సొట్టలుపడేలా నవ్వుకుంటూ వెళ్ళిపోయేది వంటింట్లోకి. అలాటిది తన పేపరు తనకి వస్తూనే వున్నా ఏమిటో బొత్తిగా కాలం గడవటంలేదు.

దీనిల్లు బంగారంగాను, అక్కడే వుండిపోయింది. ఈ ముసలాడి విషయం దాని కెందుకూ దాని కూతుళ్ళూ, కొడుకులూ .... తాతకు కోపం వచ్చింది.

ఈ మధ్య మరీ నిర్లక్ష్యం చేస్తోంది నన్ను .... కూతురు పురిటి కెళ్ళిందట .... పురుడు .... ఆ చిన్న కూతురి మీదున్నపాటి నా మీద లేదు .... ముసలాయన తను ఒక్కడూ అయిపోయినట్లు, తన భార్య తన విషయం శ్రద్ధ పట్టడం లేదన్నట్లు బాధపడ్డాడు ఆ క్షణం.

ఆయనకి ఎంతకీ నిద్ర పట్టలేదు. దగ్గరుంటే కాస్త విసరేది కదా, చిరాగ్గా విసనకఱ్ఱ తీసుకున్నాడు. గదిలోంచి నవ్వులు వినిపించాయి ఆయనకి. "అవును .... తనని చూస్తే వాళ్ళకి నవ్వే మరి .... పడుచు తనపు పొంగు ...." ముసలాయన ఆకాశం చూస్తూ పడుకున్నాడు. ఆయనకు తన భార్య కాపరాని కొచ్చిన కొత్త రోజులు గుర్తొచ్చాయి. తన భార్య నొక్కుల నల్లని జుట్టును చూసి తన తల్లి ఎంతో ముచ్చట పడేది. ఎప్పుడూ ఓపిక లేదనే ఆవిడ కోడలికి పూల జడలు గంటలు గంటలు కూర్చొని వేస్తుంటే తన కెంతో నవ్వులాటగానే వుండేది. ఓరోజు ఆవిడ పెద్ద పూల జడ వేసుకొని తన గదిలోకి వచ్చి వెడుతుంటే తమాషాకి ఆ జడ పట్టి లాగాడు తను. ఆ పెద్ద జడలోంచి ఐదారు మల్లెలు కింద రాలి పడ్డాయి. వెంటనే తన భార్య కళ్ళలో తిరిగిన నీళ్ళు ఈనాటికి మరచిపోలేదు. ఒక్క క్షణం ఆగి, "అత్తయ్య చూస్తే నవ్వుతారు" అంటూ పమిట కొంగు జడమీద కప్పుకొని గదిలోంచి నెమ్మదిగా వెళ్ళిపోయింది. తనకేం తెలుసు అంత నాజూగ్గా వుంటుంది పూల జడని! .... తన భార్య ఆ రోజుల్లో ఎంత చురుగ్గా, చలాకీగా

వుండేది .... ఎంతో అందంగా వుండేది .... చివరికి తన కూతుళ్ళ కయినా ఆ రంగూ, అందం రాలేదు. ఆ చిన్నదే కాస్త తల్లి పోలికలో వుంటుంది. తక్కిన ముగ్గురూ తన రంగే – ముసలాయనకి ఎన్నో విషయాలు గుర్తొచ్చి నవ్వు వచ్చింది. మిణుకు మిణుకుమనే నక్షత్రాలు తన ముసలితనానికి నవ్వుకుంటున్నట్లే కనిపించాయి. పందిరి మీద అక్కడా అక్కడా విచ్చిన మల్లెలు కమ్మని వాసన వెదజల్లాయి.

"పూలు అన్నీ కోసుకునే తీరిక లేదు" అనుకొన్నాడు కోడలు నుద్దేశించి ముసలాయన. అ విచ్చిన మల్లెలు నాలుగు కోసి మనుమరాలి జడలో పెట్టాడు. ఎంతకీ ఆయనకు నిద్ర రాలేదు. చివరకు "రేపు వైరిచ్చి రప్పిస్తాను" అనుకున్నాడు బలవంతంగా నిద్ర కుపక్రమిస్తూ.

తెల తెలవారుతుండగానే లేచాడు తాతగారు, ఏమిటో రోజుకన్న ఈ రోజు మరీ శూన్యంగా కనిపించింది ఆయనకు. కోడలు కాఫీ తెచ్చి ఇచ్చింది. పొగ లొస్తున్న కాఫీ వంక చూస్తూ అన్నాడు: "మీ అమ్మ వద్దతి నాకేం నచ్చలేదురా అబ్బాయ్!"

"అదేమిటి నాన్నా?" తండ్రి మాట రామానికి అర్థం కాలేదు.

"ఎన్ని రోజులుండిపోతుందక్కడ?...."

రామానికి అర్థమయిపోయింది ముసలాయన బాధ ఏమిటో.

"నువ్వే వెళ్ళమని పంపించావ్."

"పంపిస్తే, అక్కడే ఉండిపొమ్మన్నానా?"

"అది కాదు .... మనుమడో, మనుమరాలో పుట్టేదాకా రాదావిడ.... అంతే."

తండ్రికి కొడుకు మీద కోపం వచ్చింది.

"ఏడిసినట్లే ఉంది .... ఎందుకు రాదో చూస్తాగా?"

"ఏమన్నా చెప్పండి, ఆవిడ ఇప్పట్లో రాదు" కొడుకు తండ్రి ముఖంలోకి చూస్తూ అన్నాడు. ముసలాయనకి చాలా కోపం వచ్చింది. ఈ తల్లీ – కొడుకూ ఎప్పుడూ ఒకటే, తనొక్కడే పనికిరాడు వీళ్ళకి.

అంతట్లోనే ఆయనకి ఆవిడ మంచితనం, ఆవిడకి తనంటే ఎంత ప్రేమో ఒక్కసారి గుర్తొచ్చాయి.

"నీ లా మాట లక్ష్యం లేదనుకున్నావా మీ అమ్మకి .... దానికి నా మాటంటే చాలా గౌరవం" ఎటో చూస్తూ కొడుకుతో అన్నాడు. రామానికి తండ్రి మాటలకి చాలా నవ్వొచ్చింది. చిన్న పిల్లాడిలా ఆయన కోపం అతనికి చాలా తమాషాగా కనిపించింది.

"అవును లెండి, ఆవిడకి మీరంటే చాలా ప్రేమ" కోపంగావున్న తండ్రిని నవ్వించాలని అన్నాడు రామం.

"ఒకటా, రెండా, ముప్పై ఏళ్ళు కలసి కాపరం చేశాం" చాలా గర్వంగా అన్నాడు ముసలాయన.

అప్పటికే చాలా పొద్దెక్కింది రామం ఆఫీసు గొడవలో పడ్డాడు. కొడుకు ఆఫీసు కెళ్ళగానే తండ్రి ఏదో చాలాసేపు దీర్ఘంగానే ఆలోచించాడు. రామం మాటలన్నీ మళ్ళా ఒకసారి తలుచుకున్నాడు. "ఎన్నన్నా చెప్పండి ఆవిడ రాదు" అంటాడు. ఎందుకు రాదో చూస్తాగా, వైరిచ్చి రప్పిస్తాను, రాకేం చేస్తుంది? .... ఆయనకి ఇదో సమస్య అయిపోయింది. తీరా వైరిచ్చినట్టు తెలిస్తే కొడుకేమంటాడో .... ఆ వైర్ చూసి ఆవిడేం ఖంగారు పడుతుందో .... ఉత్తరం రాస్తే చాలదూ .... ఎంతసేపు ఆలోచించినా ఎటూ నిర్ణయించలేక పోయాడు .... నిజానికి వైరిచ్చి భార్యని రప్పించుకోడం తనకి ఎన్నాళ్ళనుంచో వున్న సరదా. ఆ సరదా తీరనేలేదు, ఆ అవకాశమే లేదు, ఆవిడ పుట్టింటి కెళ్ళడానికి, రావడానికి ఎప్పుడూ ఆ పెద్ద బావమఱది వుంటూనే వుండేవాడు....అసలు ఇంతకీ తన భార్యకి ఆ సరదాలు తెలియవు. ఒక చదువురాని మొద్దు.... తనే సరదాకొద్దీ ఆవిడ కాపరానికొచ్చిన కొత్తల్లో ఇంగ్లీషు అక్షరాలు రాసిచ్చాడు దిద్దమని. అదేదో చేయకూడని పనిలాగ తల్లి, భార్య కూడా భావించి సిగ్గుపడిపోయారు. అక్షరం ముక్క రాకుండానే ఇన్నేళ్ళు

సంసారం చేశాను. మరి ఇప్పుడి విచిత్రాలు అంది తల్లి. నిజమే మరి అంది ఆవిడ. అంతటితో ఆ అక్షరాలు ఆగిపోయాయి. తనకి నోరెత్త డానికి వీలు లేకపోయింది .... అంతే. ఆ రోజులే వేరు ... ఇప్పుడా, భార్యను పుట్టింటికి పంపి వారం తిరగకుండా రమ్మంటూ వైర్ చేస్తాడు కొడుకు. అదేమిటో కాని ఆ పిల్ల తెల్లారేసరికి వచ్చేస్తుంది. మొన్న మటుకు మొన్న, ఈ రాధమ్మని కడుపుతో వున్నపుడు ఆవిడని పురిటికి బావమరిదితో పంపి, 'తొమ్మిదో నెలకు మళ్ళీ వెళ్ళవచ్చు, వచ్చేయమని వైర్ చేస్తానని ఎంత గొడవ చేశాడు తన కొడుకు!' తనేగా కొడుకుతో దెబ్బలాడి ఆపించింది. ఎవరైనా వింటే నవ్విపోగలరు! అసలు తను వైర్ చేయకుండా కొడుకుని ఆపేదేకానీ, ఆఫీసుకు సెలవుపెట్టి అబ్బాయి అక్కడకి వెళ్ళనే వెళ్ళాడు .... ఏమిటో కుఱ్ఱతనం చేష్టలు.... నిజానికి ఉన్నమాట చెప్పాలంటే తనకీ ఉండేవి ఇలాంటి సరదాలు, కానీ మరి సాగలేదు!

ఆయన చాలాసేపు ఈ విధంగా ఆలోచించాడు. చివరకు సాహసించి నిర్ణయానికి వచ్చేశాడు. పోస్టాఫీసుకి నడుస్తున్నంతసేపూ తన భార్య ఏమి ఖంగారు పడుతుందో, ఆవిడ ఎందుకైనా రావడం ఆలస్యం చేస్తే కొడుకూ కోడలూ తన బేలతనానికి ఎంత నవ్వుతారో ఊహించుకుంటూనే, వైరిచ్చి వెనక్కి తిరిగొచ్చాడు.

రామం ఆఫీసునించి రాగానే, "రేపు మీ అమ్మ వస్తుంది" అన్నాడు తండ్రి మనసులో మాట దాచుకోలేక.

"ఉత్తరం వచ్చిందేమిటి?" అన్నాడు రామం నెమ్మదిగా.

"వెంటనే రమ్మని వైరిచ్చానుగా" నెమ్మదిగా అన్నాడు ముసలాయన. రామానికి నిజంగానే కోపం వచ్చింది. అన్ని పనులూ అలాగే చేస్తా డీయన. అదేమిటో తెలియక వాళ్ళెంత ఖంగారుపడతారు ఇప్పుడేం కొంప మునిగిందనీ, ఉత్తరం ముక్క చాలదూ?"

"వై రెండుకు .... డబ్బు దండగ ...." తండ్రి వినేలా అన్నాడు రామం. ముసలాయన మనస్సు చివుక్కుమంది. .... అవును తను చేసే ఏ పని అయినా దండగగానే కనిపిస్తుంది. ఆయన కాస్సేపు మాట్లాడ లేదు.

"నువ్వు రావద్దని వైర్ చేయి పోనీ" .... జేబులోంచి డబ్బు తీసి బల్లమీద పడేశాడు.

రామం ముఖం పాలిపోయింది. తను ఇంత అర్థంతో అనలేదే. తన మాట తండ్రికి ఇంత కోపం కలిగిస్తుందని తెలుసుకోలేదు....వెంటనే తండ్రిమీద జాలేసింది.... పాపం ఆయన ఒక్కడూ ఏనాడూ వుండలేదు ....ఆ ముసలితనంలో ఆప్యాయంగా దగ్గరుండే వ్యక్తి కావాలి....నిజమే మరి, రేపు తనూ ముసలాడు కాకపోడు, అప్పుడు!

రోజూలాగే తెల్లవారింది. తొమ్మిది అవ వస్తూంది. కొడుకు చూడ కుండా అప్పుడప్పుడు వీధి గుమ్మంలోకి తొంగి చూస్తున్నాడు ముసలా యన. కొడుకు తండ్రిని కనిపెట్టకపోలేదు. తండ్రిని చూస్తే జాలీ వేస్తోంది, నవ్వూ వస్తోంది రామానికి.

"అమ్మ రానట్టుందే" తండ్రికి వినపడేలా అన్నాడు. ఆయన మాట్లాడలేదు.

"సాయంత్రం బండికి తప్పకుండా వస్తుంది లెండి" అన్నాడు రామం మళ్ళా. ఈ మాటు తండ్రి సమాధానం చెప్పలేదు.

ఇంతలోనే వీధిలో బండి ఆగింది. ముసలాయన గుమ్మంలోనే చూశాడు ఆవిడ బండిలోంచి దిగుతుంటే. తాతగారి ముఖం విజయ గర్వంతో నిండిపోయింది. కొడుక్కేసి ఒక్కసారి చూశాడు.

"వెధవరైలు....ఎంతలేటో" అంది లోపలకొస్తూ రాజ్యం.

"నువ్వూ వచ్చావా తల్లీ!" కూతుర్ని చూస్తూ అన్నాడు తండ్రి.

"రాదుమరీ....మీ వైర్ చూసి బెదిరిపోయాం. ఆ చెంబెడు పసుపు నీళ్ళు ఇక్కడే పోసుకుంటుందని తీసుకొచ్చేలా.... అతనూ ఖంగారు పడి

పోయాడు. సాయంత్రం బండికి వస్తాడు" అంది ఆవిడ ముసలాయన ముఖంలోకి చూస్తూ. ఆయన ముఖం ప్రశాంతంగానే వుంది. ఇల్లు ప్రశాంతంగా వుంది. రాధమ్మ గంతులు బాగానే వేస్తోంది. అసలు విషయమేమిటో ఆవిడ కెంతకీ అర్థం కాలేదు.

ఇవేమీ ఆయన పట్టించుకోకుండా "బామ్మకి కాఫీ తీసుకురా" అన్నాడు ఒళ్ళో కూచున్న రాధమ్మతో.

"బావుంది....కాళ్ళన్నా కడుక్కోకుండా కాఫీ ఏమిటి?" ఆవిడ నూతి దగ్గర కెళ్ళింది.

"వైరెందుకిచ్చారమ్మాయ్" వంటింట్లో కాఫీ కలుపుతున్న కోడలితో అంది ఆవిడ నూతిదగ్గర నుంచే.

"ఏమో, అత్తయ్యా" అంది సుందరి నవ్వుతూ.

"అసలు విషయం చెప్పండి" శాంతమ్మ కుర్చీలో కూలబడుతూ అంది.

"ఎందుకేమిటి, నీ ముఖం" అన్నాడు ముసలాయన మనుమరాలిని ఒళ్ళో కూర్చో పెట్టుకొని.

"ఆ కాగితం చూసుకుని హడలిపోయాం.... మీ అల్లుడు సెలవు పెట్టి మరీ వస్తున్నారు" అంది కూతురు. కూతురో, కొడుకో పుట్టాక పెడితే బావుండే సెలవు ఇప్పుడు అదనంగా వృధా అయిపోతోందన్న బాధతో "అల్లుడుగారు మంచివారు కాబట్టి నేనొక్కర్తినీ ఏం ప్రయాణం చేసి రాగలను అసలే మనస్థిమితం లేకుండా అని, పిల్లను కూడా నా వెంట పంపాడు పాపం, ఆ పురుడు ఇక్కడే పొయ్యమని" అంది ముసలమ్మగారు ఆయనతో.

ఈమాటు ముసలాయన కూతుర్ని చూస్తూ అన్నాడు.

"మీ ఆయన తెలివైనవాడు.... ఆ ఖర్చంతా ఈ ముసలాయనే ఎందుకు భరించదూ అని.... ఈమాటు కొడుకే పుడతాడని అనుకొంటు

న్నాడేమో....కూతురు పుట్టి తన తిక్క వదులుస్తుందిలే.... మామగార్ని ఏడిపించాలనుకుంటున్నాడేం" - నవ్వుతూనే అన్నాడు.

"పోన్లే నాన్నా.... కూతురుపుడితే నా చిన్న తమ్ముడికిచ్చి చేస్తాను. అంతేనా" అంది రాజ్యం నవ్వుతూ.

రామానికి మాత్రం ఈ సంభాషణ రుచించలేదు.

"ఇంతకీ వై రెందుకిచ్చారో కనుక్కోవే అమ్మా" అన్నాడు. కోడలు గడపవతల నుంచొని రామాన్ని చూసి నవ్వుతోంది.

"ఏమండీ, ఇంతకీ అసలు విషయం తేల్చరేం?" అంది శాంతమ్మ.

"ఎందుకేమిటి, నా ఇష్టం. ఊరికే ఇచ్చాను" అన్నాడు ముసలాయన చాలా గర్వంగా ఆవిడకేసి చూస్తూ.

కొడుకూ, కోడలూ నవ్వు ఆపుకోలేకపోయారు. ముసలమ్మకి నవ్వు ఆగలేదు.